



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
ఆగస్టు 1, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## రాష్ట్ర ప్రభుత్వానికి అందిన 'కాళేశ్వరం' నివేదిక

**ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శికి సమర్పించిన జస్టిస్ ఘోష్ కమిషన్**

**బరాజ్‌ల వైఫల్యానికి అంశాల వారీగా బాధ్యుల గుర్తింపు..!**

**నేడు సీఎం ముందుకు నివేదిక**

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై సుదీర్ఘ విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం తన కార్యాలయంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు సీల్డ్ కవర్‌లో నివేదికను అందజేశారు. మూడు సంపుటాల్లో నివేదికను సిద్ధం చేశారు. 650కిపైగా పేజీలతో ప్రధాన నివేదిక అందజేసినట్లు జస్టిస్ ఘోష్ పేర్కొనగా.. అనుబంధాలతో కలిపి మొత్తం మూడు సంపుటాలుగా ఇచ్చిన నివేదికలో వెయ్యికిపైగా పేజీలున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి నీళ్లు సీపేజీ అయ్యాయి. ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలతోపాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో విచారణ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

**బాధ్యులు వారేనా?**

బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణంతోపాటు నిర్వహణ, పర్యవేక్షణలో పాల్గొన్న

- మిగతా 2వ పేజీలో

# 3 నెలలే గడువు

**పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం తీసుకోండి**

**తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి సుప్రీంకోర్టు ఆదేశాలు.. అనర్హతలపై నిర్ణయాధికారం స్పీకర్‌దేనని స్పష్టీకరణ**

**అలాగని తామెలాంటి ఆదేశాలూ ఇవ్వకపోతే 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్' అన్నట్టవుతుందని వ్యాఖ్య**

**అనర్హతల విషయంలో స్పీకర్‌కున్న నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునఃపరిశీలించాలని సూచన**

**ఫిరాయింపులు అడ్డుకోకపోతే ప్రజాస్వామ్య పునాదులకే ముప్పంటూ ఆందోళన....**

**స్పీకర్ నిర్ణయాలు న్యాయ సమీక్షకు పూర్తిగా అతీతం కాదన్న సర్వోన్నత న్యాయస్థానం**

**స్పీకర్ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ రాజ్యాంగపరమైన రక్షణ పొందలేరని వెల్లడి.. హైకోర్టు తీర్పు కొట్టివేత**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లపై సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం తుది తీర్పు**

న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం శాసనసభ స్పీకర్‌కే ఉందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలంగాణలో పార్టీ మారి అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయంలో తీర్పు వెలువరించిన రోజు నుంచి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సభాపతి కార్యాలయానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడాన్ని అనుమతించకూడదని పేర్కొంది. విచారణను ఆలస్యం చేసేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని చెప్పింది. మరోవైపు అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునః పరిశీలించాలని సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

**ఏడు నెలలు.. 9 సార్లు విచారణ**

పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,

- మిగతా 2వ పేజీలో






## బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి

- ప్రజల కోసమేజనహిత పాదయాత్ర
- కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- వచ్చే రెండేళ్లలో 35 వేలఉద్యోగాల భర్తీ: మహేశ్‌గౌడ్
- పరిగిలో మహాజన పాదయాత్ర

## కమిషన్ వేయాలా? వద్దా? తేలుస్తాం

**'భూదాన్' కేసులో తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు**



## సత్యం, ధర్మం గెలిచింది..

- 10 చోట్ల ఉపఎన్నికలు ఖాయం: కేటీఆర్
- సుప్రీం తీర్పును గౌరవించి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ వేటు వేయాలి
- రాజ్యాంగం పట్టుకుని నీతులు చెప్పే రాహుల్.. మాటకి కట్టుబడి ఉండాలి



హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ చేసిన నీతిమాలిన, రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయింపుల రాజకీయానికి అత్యున్నత ధర్మాసనం తీర్పు చెంపదెబ్బ లాంటిదని చెప్పారు. కొందరు ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొ కినంత మాత్రాన భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని నిరూపించిన సుప్రీంకోర్టుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కోర్టులను తప్పుదోవ పట్టించాలన్న కాంగ్రెస్ కుట్రలను ఎదురొని అంతిమంగా సత్యం, ధర్మమే గెలిచిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్పీకర్ వెంటనే అమలు చేయాలని కేటీఆర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రాహుల్‌గాంధీ తన నిజాయితీ, నిబద్ధతను నిరూపించుకోవాలని కోరారు. పార్టీ మారితే ఆటోమేటిక్‌గా

- మిగతా 2వ పేజీలో



## సవరణపై సభా సమరం

- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఆపాల్సిందేనన్న విపక్షాలు
- ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలంటూ డిమాండ్
- కొనసాగిన విపక్షసభ్యుల ఆందోళనలు, నినాదాలు
- అర్ధంతరంగా వాయిదాపడిన ఇరుసభలు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన వివాదాస్పద ఓటర్ల జాబితా సమగ్ర సవరణ క్రతువును తక్షణం నిలిపివేయాలన్న విపక్షాల డిమాండ్లతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. గురువారం ఉదయం రాజ్యసభలో సభాకార్యకలాపాలు మొదలవగానే విపక్షసభ్యులు తమ డిమాండ్లను నినాదాల రూపంలో వినిపించారు. ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటల చర్యకు ప్రధాని మోదీ ఎందుకు రాజ్యసభలో సమాధానం ఇవ్వలేదని విపక్ష సభ్యులు ప్రశ్నిస్తూ సభాకార్యకలాపాలను అడ్డుకున్నారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఈసీ వెంటనే ఆపేయాలనీ విపక్ష సభ్యులు డిమాండ్‌చేశారు. దీంతో సభను

- మిగతా 2వ పేజీలో

# కమిషన్ వేయాలా? వద్దా? తేలుస్తాం

## 'భూదాన్' కేసులో తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూదాన్ భూముల అన్యాక్రాంతం, అక్రమాల ఆరోపణలపై విచారణ కమిషన్ వేయాలా? వద్దా? అనేది తేలుస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేసింది. ఈ సర్వే నంబర్లలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు భూములను అక్రమంగా తమ పేరిట నమోదు చేసుకున్నారని, వీటిపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని దాఖలైన మరో పిటిషన్‌లోని మధ్యంతర అప్లికేషన్ల(ఐఏ)లో తీర్పు వాయిదా వేసింది. భూకబ్జాలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, దీనిపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్, పడమటి తండాకు చెందిన రాములు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మళ్లీ విచారణ చేపట్టారు.

**తెలియకుండా భూములు మార్చేశారు..**

పిటిషనర్ తరపున డాక్టర్ జె.విజయలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. '194/ఐ, 195/ఐలో రాములు భూములున్నాయి. ప్రస్తుతం ఆ భూములు అతని అధీనంలోనే ఉన్నాయి. పాస్‌బుక్ అతని పేరిటే ఉన్నా.. భూభారతిలో మాత్రం జావేద్, ఆర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్ పేర్లు చూపిస్తోంది. తనకు తెలియకుండా ఆన్‌లైన్‌లో ఎలా మార్చారో చెప్పాలని తహసీల్దార్‌ను కోరినా వివరాలు ఇవ్వలేదు. కోర్టు ఆదేశించినా స్పందనలేదు. కమిషన్ వేస్తే గానీ వివరాలు బహిర్గతం కావని కోర్టును ఆశ్రయించాం'అని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'కమిషన్ వేస్తారు.. నివేదిక వస్తుంది, అది కూడా ఉన్నతాధికారులకు సమర్పించాల్సిందే, అప్పుడు కూడా ఆ నివేదికను అల్మారాలో పెట్టి వదిలేస్తే ఏం చేస్తారు'అని ప్రశ్నించారు. మళ్లీ కోర్టును ఆశ్రయించాల్సిందేనని న్యాయవాది బదులిచ్చారు. ప్రభుత్వం తరపున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వ్యక్తిగత అంశాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడం సాధ్యం కాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి అందిన 'కాళేశ్వరం' నివేదిక



నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, మాజీ ఈఎన్సీలు, సీఈలు, ఎస్ఈలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను కమిషన్ ప్రశ్నించి కీలక సాక్ష్యాధారాలను సేకరించింది. బరాజ్‌ల స్థల ఎంపికతోపాటు ఇతర కీలక నిర్ణయాలను నాటి సీఎం కేసీఆర్ తీసుకున్నారని పలువురు మాజీ ఇంజనీర్లు, ఐఏఎస్‌లు విచారణ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వేలాది ఫైళ్లను జల్లెడ పట్టిన కమిషన్.. ఎన్నో అవకతవకతలను గుర్తించింది. క్రాస్ ఎగ్జామినేషన్‌లో పాల్గొనే సాక్షులకు వాటి ఆధారంగా ప్రశ్నలను సంధించింది. విచారణ చివర్లో మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు, మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించింది. మంత్రివర్గ నిర్ణయాల ఆధారంగానే బరాజ్‌ల నిర్మాణ పనులు జరిగాయని మాజీ మంత్రులిద్దరితోపాటు కేసీఆర్ కమిషన్ ఎదుట వాగ్మూలం ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ వాదనలను ఖండిస్తూ అసలు గత ప్రభుత్వంలోని జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు జరగలేదని తేల్చింది. దీనికి సమర్థనగా గత ప్రభుత్వంలో జరిగిన కేబినెట్ సమావేశాలకు సంబంధించిన తీర్మానాల ప్రతులతో కమిషన్‌కు నివేదిక అందించింది. బరాజ్‌లకు సంబంధించిన నిర్ణయాలను ఎవరు తీసుకున్నారనే అంశాన్ని నిర్ధారించడానికి ఈ నివేదిక కీలకం కానుంది. ప్రధానంగా తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ స్థల మార్పుపై నిర్ణయం ఎవరు తీసుకున్నారనే అంశంపై కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా పలువురు సాక్షులను ప్రశ్నించింది. చాలా మంది సాక్షులు దీనికి సమాధానంగా ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌ల పేర్లను ఉటంకించారు. విచారణకు హాజరైన సాక్షుల్లోనే పలువురి పాత్రపై ఆధారాలను సేకరించిన కమిషన్.. వారినే బాధ్యులుగా నిర్ధారిస్తూ నివేదికలో పొందపరిచినట్లు సమాచారం.

**నేడు సీఎంకు నివేదిక..**

జస్టిస్ ఘోష్ గురువారం సమర్పించిన నివేదిక నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చేరగా.. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆ నివేదికను అందచేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ 'సాక్షి'కి తెలిపారు. అనంతరం నివేదికను మీడియాకు బహిర్గతం చేయనున్నట్లు తెలిపారు.

**అంశాలకు కట్టుబడే నివేదిక.. జస్టిస్ ఘోష్**

ప్రభుత్వం కమిషన్‌కు నిర్దేశించిన అంశాలకే పరిమితమై నివేదికను సిద్ధం చేసినట్లు జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ఎలాంటి సిఫారసులు చేయలేదని మీడియాకు తెలియజేశారు. సర్కారుకు నివేదిక అందించడంతో తన బాధ్యత తీరిందన్నారు. ఇకపై కమిషన్ కార్యకలాపాల కోసం హైదరాబాద్‌కు రానన్నారు. సర్కారు నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్నించగా అది తనకు తెలియదన్నారు.

**బాధ్యులెవరు? ప్రజాధన దుర్వినియోగం ఎంత?**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలు, కాంట్రాక్టర్లకు పనుల అప్పగించిన తీరు, చేసుకున్న ఒప్పందాలు, వాటి అమలు తీరు/ఉల్లంఘనలతోపాటు వాటి అమల్లో ఆర్థిక క్రమశిక్షణ కఠినంగా పాటించారా లేదా? వంటి అంశాలపై విచారణ కోసం ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. క్వాలిటీ కంట్రోల్, పర్యవేక్షణ అంశాలు, నిర్మాణ సంస్థలు/కాంట్రాక్టర్లు, నీటిపారుదల శాఖల నిర్లక్ష్యం, ఇతర అవకతవకతలపై విచారణ జరపాలని కోరింది. అసమంజస రీతిలో ఒప్పందాల గడువు పొడిగింపు, పనులు పూర్తయినట్లు తప్పుడు సర్టిఫికేట్ల జారీ, గడువు పూర్తికాక ముందే బ్యాంక్ గ్యారెంటీల విడుదల, తదితర చర్యలతో నిర్మాణ సంస్థలు/కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించిన వ్యవహారంపై విచారణ జరిపి సంబంధిత అధికారులు/సంస్థలను బాధ్యులుగా నిర్ధారించాలని సూచించింది. అంశాలవారీగా బాధ్యులను గుర్తించడంతోపాటు దుర్వినియోగమైన నిధులను కమిషన్ నిర్ధారించి నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.

# సత్యం, ధర్మం గెలిచింది..

అనర్హత వర్తించాలని పాంచ్ న్యాయ్ పేరుతో చెప్పిన రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతించాలని కోరారు. పాంచ్ న్యాయ్ పేరుతో చెప్పిన నీతులను రాహుల్‌గాంధీ ఆచరణలో చూపించాలని పేర్కొన్నారు

**రాహుల్ చిత్తశుద్ధిని చాటుకోవాలి**

చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తిరిగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అత్యున్నత ధర్మాసనం ఇచ్చిన తీర్పును అమలుచేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాజ్యాంగానికి ధర్మకర్తగా నిలిచే గౌరవ సుప్రీంకోర్టు ఎత్తిచూపిన కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను అడ్డుకోవాలని సూచించారు. పార్టీ ఫిరాయింపులపై రాష్ట్రానికో నీతి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక నీతి, ప్రభుత్వంలో ఉ న్నప్పుడు ఒక నీతి అన్నట్టుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ అవకాశవాద వైఖరిని ప్రశ్నించి తన కు వెన్నెముక ఉన్నదని నిరూపించుకునే అవకాశం రాహుల్‌కు వచ్చిందని తెలిపారు. ఫిరాయింపులను తిరసరించకుంటే రాహుల్‌చరిత్రహీనుడిగా మిగిలిపోతారని హెచ్చరించారు.

**విచారణ అనవసరం**

ఫిరాయింపులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకొని రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ భారత రాజ్యాంగాన్ని మరింత కాలం అవహేళన చేయరని ఆశిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రతిరోజు పాల్గొంటున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలపైన అనర్హత విధిస్తూ వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజాస్వామిక చరిత్రలో మైలురాయిగా నిలిచిపోయేలా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఇందుకు బీఆర్ఎస్ తరపున సమర్ధవంతమైన వాదనలు వినిపించిన న్యాయవాద బృందానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

**ఉప ఎన్నికలకు సిద్ధంకండి**

బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన 10 ఎమ్మెల్యే లు ప్రలోభాలకు లొంగి పార్టీ మారినా కష్టకాలంలో పార్టీ వెంట నిలిచిన లక్షలాదిమంది కా ర్యకర్తలకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. 20 నెలల నుంచి రేవంత్ ప్రభుత్వం చేస్తున్న అడ్డగోలు, అప్రజాస్వామిక, అవినీతి రాజకీయాలను ఎండగడుతూ పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలు గొప్ప స్ఫూర్తిని చాటారని కొనియాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో వచ్చే మూ డు నెలల్లో 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు వస్తాయని భావిస్తున్నట్టు తెలిపారు. ఉప ఎన్నికలకు పార్టీ సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు. గెలుపు కోసం పని చేద్దామని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.




# బాధ్యతలు చేపట్టిన కొత్త జడ్జీలు

**నలుగురితో ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్**

**తొలిరోజే విచారణ చేపట్టిన జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ మొహియుద్దీన్**

హైదరాబాద్: హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జీలు అదనపు న్యాయమూర్తులుగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గాడి ప్రవీణ్ కుమార్, రామకృష్ణారెడ్డి, సుద్దాల చలపతిరావు, గౌస్ మీరా మొహియుద్దీన్‌తో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో పాటు కొత్త జడ్జీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన కొత్త జడ్జీలు తొలిరోజు సీనియర్ న్యాయమూర్తులతో కలసి కేసుల విచారణలో పాల్గొన్నారు. వీరి నియామకంతో హైకోర్టులో జడ్జీల సంఖ్య 30కి పెరిగింది. ఇంకా 12 ఖాళీలున్నాయి. ఈ నలుగురిని న్యాయవాదుల కోటాలో జడ్జీలుగా నియమిస్తూ గత నెల 28న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# 3 నెలలే గడువు



తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్‌లు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పి) దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు దాఖలైన తర్వాత దాదాపు ఏడు నెలల్లో తొమ్మిది సార్లు సుప్రీంకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, మోహిత్ రావు, స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, తదితరులు వాదనలు వినిపించారు. గత ఏప్రిల్ 3న విచారణ ముగించి తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం.. గురువారం తీర్పు వెలువరించింది.

**ఎంత సమయం కావాలని ముందే అడిగాం..**

'2025 జనవరి 15న సుప్రీంకోర్టు ముందు కేసు దాఖలైన తర్వాత 16న తొలిసారిగా మేం కొందరికి నోటీసులు జారీ చేశాం. ఫిబ్రవరి 3న జరిగిన విచారణ సందర్భంగా.. ఫిబ్రవరి 4న మరికొందరికి నోటీసులు జారీ చేశాం. జనవరి 31న తొలుత ఈ కేసు విచారణకు వచ్చినప్పుడే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు ఎంత సమయం అవసరమో తెలుసుకోవాల్సిందిగా మేము సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి సూచించాం..' అని ధర్మాసనం తెలిపింది.

**'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్'లా ఉండాలి**

'10 షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యునల్‌గా పని చేస్తున్నప్పటికీ, ఆయన ఎటువంటి రాజ్యాంగపరమైన రక్షణ (కానిస్టిట్యూషనల్ ఇమ్యూనిటీ)ను పొందలేరు. నిజానికి ఈ కేసును విచారించిన సింగిల్ జడ్జి అనర్హత పిటిషన్లపై విచారించేందుకు సమయాన్ని నిర్ణయించమని స్పీకర్‌కు సూచించారు. అందుకు నాలుగు వారాల గడువిచ్చారు. అంతేకానీ పిటిషన్లపై నిర్ణయం తీసుకోమని ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. అయినప్పటికీ.. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకుని సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని చెప్పడం ద్వారా డివిజన్ బెంచ్ తప్పిదానికి పాల్పడింది. ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు లేకపోయినా తెలంగాణ శాసనసభ కార్యదర్శి సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేయడం సరైంది కాదు. ఇకపై ఈ కేసు 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్' లా ఉండాలి..' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.



# బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి

**ప్రజల కోసమేజనహిత పాదయాత్ర .. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్**

**వచ్చే రెండేళ్లలో 35 వేలఉద్యోగాల భర్తీ: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్**

వికారాబాద్, పరిగి: ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లని.. అందుకే వారి కోసం పాదయాత్ర చేస్తున్నామని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో కాంగ్రెస్ చేపట్టిన జనహిత పాదయాత్ర, రోడ్‌షోలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆమె గురువారం పాల్గొన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ నుంచి పరిగి పట్టణం వరకు ఆరు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక కొడంగల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మీనాక్షి మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంతో పోరాడుతున్నామని, ప్రజలు సైతం ఇందులో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోందని తెలిపారు. పాదయాత్రలకు కాంగ్రెస్ పెట్టింది పేరు అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పాలనలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలిచ్చామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తమ అధినాయకత్వం డిమాండ్ చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముఖం చాటేస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పూర్తి చేసి తీరుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, బి.మనోహర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పీసీసీ ప్ర్యధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ రామచల్ల సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సవరణపై సభా సమరం

సభాధ్యక్షుడు మధ్యా హ్నం 2 గంటలవరకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా మళ్లీ ఇదే విపక్షాల డిమాండ్ల పర్వం కొనసాగింది. వెంటనే ప్రధాని మోదీ సభకు వచ్చి ఆపరేషన్ సిందూర్‌పై సమాధానం ఇవ్వాలని విపక్ష సభ్యులు నినాదాలుచేశారు. ఈ సందర్భంగా రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు సభాధ్యక్షుడు సస్మిత్ పాత్రా అనుమతించారు. " 2008లో ముంబై ఉగ్రదాడులపై నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో వివరణ ఇవ్వనప్పుడు నాట హోం మంత్రి వివరణ ఇచ్చారు. అంతేగానీ హోం మంత్రి అమిత్ షా లాగా " నేనొక్కడినే మీ అందరినీ అదమాయించగలను. హ్యాండిల్ చేస్తాను" అని అందర్నీ తూలనాడలేదు. ఇప్పటికైనా ప్రధాని మోదీ సభకు వచ్చి మాట్లాడాలి" అని ఖర్గే డిమాండ్‌చేశారు. ఈయన మాటలకు విపక్షసభ్యులు గొంతు కలిపారు. దీంతో చేసేదిలేక సభను సాయంత్రం నాలుగున్నర గంటలదాకా వాయిదావేశారు. 4.30 గంటలకు సభ మొదలయ్యాక ట్రంప్ చేసిన 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు వాణిజ్యమంత్రి గోయల్ ఘాటుగా స్పందిస్తూ ప్రకటనచేశారు. అయినాసరే విపక్షసభ్యులు తమ నినాదాలను ఆపకపోవడంతో చివరకు సభను శుక్రవారానికి వాయిదావేశారు.

**లోక్‌సభలోనూ అదే తీరు..**

లోక్‌సభలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. లోక్‌సభ ఉదయం మొదలుకాగానే జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా నైసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తలకు సభ అభినందించింది.



## కీర్తన అనాధాశ్రమానికి నాగార్జున స్కూల్ విద్యార్థుల వితరణ

ఎల్బీనగర్, 31 జులై : సాగర్ రోడ్డు హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు గురువారం కీర్తన అనాధాశ్రమానికి 8 క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల కందిపప్పు విరాళంగా అందజేశారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్ రెడ్డి జన్మదిన సందర్భంగా పాఠశాలలో చారిటీ డే నిర్వహించారు. విద్యార్థుల నుంచి సేకరించిన సరుకులకు తోడు యజమాన్యం కొంత కలిపి ఆశ్రమానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. చిన్నారుల్లో సేవాభావం పెంపొందించడానికి తమ పాఠశాలలో ఏడాదిలో ఒకరోజు చారిటీ డే నిర్వహిస్తామని గుర్తు చేశారు. చిన్నారులకు సమాజం పట్ల అవగాహన కల్పించి వారిని ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని విఠల్ రెడ్డి సూచించారు. చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి తమ విద్య సంస్థలలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్పర్సన్ జి.రజిని విఠల్ రెడ్డి, సీఏఓ శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ ఏ. పద్మావతి, ఇన్చార్జిలు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## రేవంత్ సర్కార్ లో లంబాడీలకు దక్కని గుర్తింపు

కల్వకుర్తి జూలై 31 వార్త మిర్రర్ ప్రతినిధి:-కాంగ్రెస్ ప్రభుత్వం లో లంబాడీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో ఒక్క లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వలేదని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ మండిపడ్డారు. లంబాడీలకు జరిగిన అన్యాయం గురించి లంబాడి విద్యార్థి సంఘాలు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ సందర్భంలో ముందస్తుగా ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్ తో పాటు పలువురు నాయకులను కడ్తాల్ పోలీసులు అరెస్టు చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో లంబాడీలకు ప్రత్యేక గుర్తింపు ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి కావాలని లంబాడీలకు అనుగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లంబాడీలు రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అరెస్టు అయిన వారిలో డైరెక్టర్ సేవ్య నాయక్ మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్ నాయకులు పాండు నాయక్ శీను నాయక్ మోతిలాల్ నాయక్ కిషన్ నాయక్ చందర్ నాయక్ కిషన్ నాయక్ భిక్య నాయక్ నాయకులు పాల్గొన్నారు.




## న్యాయవాది ఎండి. ఇస్మాయిల్ స్ఫూర్తితో న్యాయవాదుల సమస్యల పరిష్కారంకై పోరాడుదాం

### ఐలు జిల్లా అధ్యక్షులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. బొల్లెపల్లి కుమార్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

ప్రముఖ న్యాయవాది, ఐలు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి. ఇస్మాయిల్ గారి స్ఫూర్తితో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకై ఐక్యంగా పోరాడుదామని ఐలు జిల్లా అధ్యక్షులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. బొల్లెపల్లి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో ఎండి. ఇస్మాయిల్ 2వ వర్ధంతి సందర్భంగా న్యాయవాదులతో కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఎండి ఇస్మాయిల్ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని, పేదలకు, ప్రజలకు చట్టపరంగా వస్తున్న సమస్యల విషయంలో వృత్తిపరంగా వారికి అండగా ఉంటూ పరిష్కారంలో ముందు బాగాన ఉన్నారని తెలిపారు. నేటికీ న్యాయవాదులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఇప్పటికైనా 2019 ఎన్రోల్మెంట్ అయిన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, కార్పస్ ఫండ్ ను రూ.500 కోట్లకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ వారు చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి గౌడ్,సీనియర్ న్యాయవాదులు వి. దామోదర్ రెడ్డి,నాగారం అంజయ్య,ఎం.ఏ రహీం, జి. బాబురావు పాల్గొని మాట్లాడగా పి.లింగారెడ్డి, కేశవరెడ్డి, నరసింహ యాదవ్, విద్యాసాగర్,గోద వెంకటేశ్వర్లు,ఎండి. నేహాల్, రేణుక, యం.చంద్రశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## వంగరి అనసూయ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న భగీరథ ఆత్మ గౌరవ భవన్ ట్రస్ట్ మెంబర్ రాసాల వెంకటేశ్ సాగర్

### వంగరి అనసూయ కు నివాళులర్పించిన ఢిల్లీ వెంకటేష్ గౌడ్, కృష్ణ యాదవ్ కర్ణాకర్ గౌడ్ నర్సింగ్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో రాఘవేంద్ర ఫంక్షన్ హాల్ లో భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షులు వంగరి రఘుపతి తల్లి వంగరి అనసూయ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వంగరి అనసూయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాజీ ఎంపీటీసీ అత్మూరి రాములు, కోర్ర నరేందర్, బిజెపి మండల ఉపాధ్యక్షుడు వెలిజాల శ్రీను, బిఆర్ఎస్ నాయకులు, భగీరథ ఆత్మగౌరవ భవన్ ట్రస్ట్ మెంబర్ రాసాల వెంకటేష్ సాగర్, బిఆర్ఎస్ నాయకులు పాశం కృష్ణ యాదవ్, కంఠమహేశ్వర స్వామి టెంపుల్ చైర్మన్ రాపర్తి కరుణాకర్, వెంకటేష్ గౌడ్, (ఢిల్లీ) ప్రముఖ రియాల్టర్ మోహన్ గౌడ్, నీళ్ల నరసింహ గౌడ్, కోర్ర శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు పకడ్బంది కార్యాచరణ

### ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత



మిర్యాలగూడ, జూలై 31:-( వార్తమిర్రర్) : మిర్యాలగూడ తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు ప్రత్యేక క్యాలెండర్, కార్యాచరణ రూపొందించినట్లు మిర్యాలగూడ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత తెలిపారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుండి 7వరకు బిడ్డకు పాలిచ్చే, తినే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు..ఎన్ఎఫ్హెచ్ఎస్-5 గణాంకాల ఆధారంగా పరిస్థితుల విశ్లేషణ జరిగిందన్నారు.ఆగస్టు ఒకటిన మండల, సెక్టార్ స్థాయి అంగన్వాడి టీచర్స్, ఆశా వర్కర్లకు థీమ్ అవగాహన కల్పిస్తామన్నారు.గర్భిణులైన మహిళలు 3వ త్రైమాసికం,0-6 నెలల, 6-24 నెలల పిల్లల ఇళ్లు సందర్శన ఉంటుందన్నారు.సెక్టార్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్స్, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, పోషన్ బ్లాక్ టీమ్స్ పాల్గొంటాయన్నారు.ఆగస్టు 2న గ్రామ, వార్డు స్థాయిలో విహెచ్ఎస్ఎన్డి కార్యాచరణలు ఉంటాయన్నారు.గర్భిణులు, పాలిచ్చే తల్లులు, మహిళలు, పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొనవచ్చన్నారు.తల్లిపాలు, అనుబంధ ఆహారం ప్రారంభంపై అవగాహనఆగస్టు 2 నుండి 7 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ప్రసూతి ఆసుపత్రుల సందర్శన ఉంటుందన్నారు.తల్లులకు 1 గంటలో తల్లిపాల ప్రారంభం గురించి అవగాహన కల్పిస్తామన్నారు.తల్లిపాల ప్రాముఖ్యతపై పోస్టర్లు ప్రదర్శన,ఉద్యోగ స్థలాల్లో తల్లిపాల కోసం ప్రైవసీ కార్నర్ ఏర్పాటు కలెక్టర్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి, ఐసిడిఎస్ పిఓ, ఇతర జిల్లా అధికారులుంటారన్నారు. ఆగస్టు 4న గ్రామస్థాయిలోఅ న్నప్రాసనపై అవగాహన పూర్తి దృష్టి: 6 నెలలలోపు బిడ్డలకు సరైన సమయంలో అనుబంధ ఆహారం మొదలుపెట్టడం,తల్లిపాలను 2 సంవత్సరాల వరకు కొనసాగించమని ప్రోత్సాహిస్తామన్నారు.ఆగస్టు 5న 0-24 నెలల పిల్లల ఇళ్ల సందర్శనలు చేస్తామన్నారు.తల్లులకి తల్లిపాలు, బంధం, ఫీడింగ్ ఫ్రీక్వెన్సీ, సరైన స్థితిలో పిల్లలకు పాలను పట్టడం గురించి కౌన్సెలింగ్పాలు కాకుండా ఇతర మార్గాల (సబ్స్టిట్యూట్స్) వాడకాన్ని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.ఆగస్టు 7న స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించి సభ్యులకు అవగాహన కల్పించనున్నామన్నారు. పిల్లల ఆరోగ్యం, తల్లిపాలు, మహిళల సంక్షేమం గురించి వివరించనున్నామన్నారు.ఇంటింటికి అంగన్వాడీ కౌన్సిలింగ్ పుస్తకం ద్వారా ప్రతి రోజు ఇంటి సందర్శనలు ఉంటాయన్నారు.కుటుంబ సభ్యుల (ప్రత్యేకించి పురుషుల భాగస్వామ్యం ప్రోత్సాహం ఉండాలన్నారు.

# రోడ్డు భద్రతపై తార్నాక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు బేగంపేట టీటీఐ పోలీసుల అవగాహన

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ జులై 31 : బాల్యం నుంచి ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలపై అవగాహణ కలిగి వుండాలని బేగంపేట టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, నిరక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రాణాలు పోగొట్టుకుట్టుకోవద్దని బేగంపేట టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్ సూచించారు. యువత విద్యార్థులు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఇన్స్ పెక్టర్ పేర్కోన్నారు. హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ సి.పి. జోయల్ డేవిస్ ఇతర ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గురువారం బేగంపేట టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల ఆశోక్ తార్నాకలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు,నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా నాగుల ఆకోక్ ఇన్స్పెక్టర్ టిటిఐ బేగంపేట మాట్లాడుతూ రోడ్లు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్లు, ఫుట్ ఓవర్ బిడ్జిలను ఉపయోగించాలన్నారు. విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు ఎల్లప్పుడూ తల్లిదండ్రులు లేదా ఇతర పెద్దల సహాయం తీసుకోవాలన్నారు. నడవడానికి ఎల్లప్పుడూ ఫుట్పాత్ ను ఉపయోగించాలని, పిల్లలు, తల్లిదండ్రులకు ఇతర పెద్దలకు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బస్సు, ఆటో, కారు ఎక్కేటప్పుడు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, బాగా చదువుకుని తల్లిదండ్రులు గర్వపడేలా చేయాలన్నారు. ఆనంతరం చిలుకలగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అందరు రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సుమారు 200 మంది విద్యార్థులు, ప్రిన్సిపాల్ ప్రశాంతి, బేగంపేట టిటిఐ సిబ్బంది ఆయాన్ కృష్ణ పాల్గొన్నారు.





## పదవీ విరమణ తర్వాత సేవా కార్యక్రమాలలో పాల్గొనాలి విద్యుత్ శాఖ డిఇ శ్రీనివాసచారి

మిర్యాలగూడ ,జూలై 31:- (వార్త మిర్రర్) ఉద్యోగ విరమణ అనంతరం సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని మిర్యాలగూడ విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసచారి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ విద్యుత్ బిసి నాయకులు, లైన్ మెన్ పగిడి పుల్లయ్య వెంకటమ్మ లైన్ మెన్ నువిద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం తరపున విద్యుత్ బిసి సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు బచ్చు రామచందర్ అధ్యక్షతన ఉద్యోగ విరమణ కార్యక్రమం డివిజన్ ఆఫీసులో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం ఏడిఈ కోడిరెక్క రవికుమార్, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, టౌన్ టు ఏఈ రవీందర్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్, నల్గొండ జిల్లా అధ్యక్షులు వైవి గిరి మాట్లాడుతూ పదవి విరమణ ఫంక్షన్ కు 1104 యూనియన్, 327 యూనియన్, టి ఆర్ వి కె ఎస్ యూనియన్, ఎస్సీ ఎస్టీ సంఘాలు, మైనార్టీ, ఓసి అసోసియేషన్, అధికారులు ఉద్యోగులు మహిళా ఉద్యోగులు కార్మికులు సన్మానించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి రాచకొండ వెంకన్న, చంద్రశేఖర్, గంజి పాండురంగ, హరికిషన్, కొండల్, వినయ, అనుష, నవీన్, మురళి, హరి, షఫీ, తోట వెంకటేశ్వర్లు, కొండల్ నాయక్, రిజ్వాన్, సైదులు, కృష్ణారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.



## యాదాద్రి థర్మల్ పవర్ విద్యుత్ కేంద్రానికి రానున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు

### వై టి పి ఎస్ టౌన్ షిప్ కు శంకుస్థాపన

మిర్యాలగూడ జూలై 31:- (వార్త మిర్రర్) మిర్యాలహగూడ శాసనసభ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం వీర్లపాలెం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కు ఆగస్టు ఒకటిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇంచార్జి, రాష్ట్ర ఎస్సి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రానున్నారని అధికార ప్రకటనలో తెలిపారు. బేగంపేట ఎయిర్ పోర్టు నుండి ఉదయం 9 గంటలకు బయలు దేరి 10 గంటలకు వైటిపిఎస్ చేరుకుంటారని, ఉదయం 10:15 గంటల నుండి 11వరకు వైటిపిఎస్ సమీకృత టౌన్ షిప్ శంకుస్థాపన చేస్తారని, 11:05 నుండి 11: 45వరకు వైటిపీఎస్టేజ్ - 2, 800 మెగావాట్ల యూనిట్ - 1 జాతికి అంకితం చేస్తారని, 12:10 గంటల నుండి ఒంటి గంట వరకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పనుల ప్రగతి, జెన్కో, బిహెచ్ఇఎల్ అధికారులతో చర్చా గోష్టి నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1: 45కు దామరచర్ల నుండి బేగంపేటకు వెళ్తారని పేర్కొన్నారు.



## మిర్యాలగూడలో ఆగస్టు 1న జరిగే చేయూత పెన్షన్ దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయండి

మిర్యాలగూడ , జూలై 31:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ పంక్షన్ హాలులో ఆగస్టు ఒకటిన జరిగే చేయూత పింఛన్ దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఎండి.అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సదస్సుకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, పొలిట్ బ్యూరో సభ్యులు దైద సత్యం తదితర నాయకులు హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు. వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల ఆత్మ బంధువు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. నల్లగొండ జిల్లాలో ఉన్న వికలాంగులు చేయుత పెన్షన్ దారులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో విహెచ్ పిఎస్ నాయకులు సైదులు మదన్ నాయక్, పాలయూ ఆఫ్సర్, శ్రీను, విజయ్, సామ మధు, సుధాకర్, ఖాసీం, మాధవరెడ్డి , బి.నరసింహ, కె.శ్రీనివాసు, రాజయ్య, వి.సురేష్, వీ.సైదులు, ఎస్కే.ఖాసీం, శ్రీకాంత్, పీ.సతీష్, అయ్యుబ్ ఖాన్, డి.వెంకన్న, డి.వెంకన్న, ఎం.రవి, సిహెచ్.బాలకృష్ణ, దర్శనం సైదులు, మేక నాగరాజు పాల్గొన్నారు



### మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్లో భాగంగా కాకతీయ హిల్స్‌లో

## పర్యటించిన జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్వి కర్ణన్

మాదాపూర్ వార్త మిర్రర్ : ఇండ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిలువకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. జూలై 29 వ తేదీ నుండి ఆగస్టు 8 వ తేదీ వరకు జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో కొనసాగనున్న మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్లో భాగంగా గురువారం జీహెచ్ఎంసి కమీషనర్ ఆర్వి కర్ణన్ మాదాపూర్ లో ని కాకతీయ హిల్స్లో స్థానిక జీహెచ్ఎంసి అధికారులు, శానిటేషన్, ఎంటమాలజీ సిబ్బందితో కలిసి పార్కులను సందర్శించిన అనంతరం కాలనీలో పలు ఇండ్లను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షకాలంలో అనేక రోగ కారకాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. స్థానికులు ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇండ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, టైఫాయిడ్, ఫ్లూ వంటి రోగాలు వ్యాప్తి చెందకుండా ఆరోగ్యకరమైన అహారపదార్థాలను తీసుకోవాలన్నారు. ఇందులో శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ హేమంత్, డిప్యూటీ కమిషర్ శశిరేఖ, టౌన్ప్లానింగ్ ఏసిపి నాగిరెడ్డిలతో పాటు శానిటేషన్, ఎంటమాలజి సూపర్వైజర్ శ్రీనివాస్ వర్మ, ఎస్ ఆర్ పి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఎఫ్ ఏ అజహరుద్దీన్ తదితర సిబ్బంది ఉన్నారు.



## తెలంగాణ కాంగ్రెస్ పాదయాత్ర సన్నాహక సమావేశం, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్ ల పంపిణీ..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : పరిగి నియోజకవర్గం నుండి ప్రారంభమయ్యే "తెలంగాణలో నూతన మేల్కొలుపు – కాంగ్రెస్ పాదయాత్ర" ప్రారంభానికి సంబంధించి టీ పి సి సి రాష్ట్ర ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టి పి సి సి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగే కీలక సన్నాహక సమావేశంలో చురుగ్గా పాల్గొనేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్.ఈ సందర్భంగా, జగదీశ్వర్ గౌడ్ అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో కూడా పాల్గొని, ప్రజాసేవ సంక్షేమం పట్ల నాయకుల నిబద్ధతను పునరుద్ఘాటించారు. జరగబోయే యాత్రలో చురుగ్గా పాల్గొనడానికి ప్రతి అడుగులో ప్రజలతో నిలబడటానికి. సామాజిక న్యాయం కోసం ఒక పాదయాత్ర. మార్పు కోసం ఒక అడుగు. ప్రజల కోసం ఒక స్వరం ను వినిపిస్తాం అని మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ యలమంచి ఉదయ్ కిరణ్ ఈ సందర్భంగా తెలిపారు.




## క్రీడాకారులను అభినందించిన రవియాదవ్..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :చత్తీస్‌గఢ్‌లోని బిలాస్పూర్‌లో జరిగిన 5 వ జాతీయ సబ్–జూనియర్ అండ్ క్యాడెట్ (గ్రాప్లింగ్ (రెస్లింగ్) ఛాంపియన్‌షిప్ 2025 లో భాగంగా పాల్గొన్న తెలంగాణ టీమ్ గురువారం రోజు చర్లపల్లి రైల్వే స్టేషన్ చెరుకున్న. టీమ్ సభ్యులు, కోచ్ మరియు సహాయక సిబ్బందికి శేరిలింగంపల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మార బోయిన రవియాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పోటీల్లో తెలంగాణ టీమ్ అన్ని మెడళ్లు సాధించిన టీమ్ సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి గౌరవించారు. తెలంగాణ యువ క్రీడాకారుల ఈ విజయం మనందరికీ గర్వప్రదం. మీ అవిరామ కృషి మరిన్ని విజయాలను సాధించాలని కోరుకుంటున్నానని తెలిపారు.

## తెలంగాణ పోరాటాన్ని తలపిస్తున్న బీసీ రేజర్వేషన్ల ఉద్యమం...

### బరిగీసి కొట్లాడితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు లక్ష రాజకీయ పదవులు దక్కడం ఖాయం...

### దాసు సురేశ్ , వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ రాజ్యాధికార సమితి...



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి... బీసీల రేజర్వేషన్ల పెంపు కోసం దశాబ్దాలుగా కొనసాగుతున్న బీసీ రాజ్యాధికార ఉద్యమం నేడు మరో తెలంగాణ ఉద్యమాన్ని తలపిస్తున్నదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ వెల్లడించారు.. గురువారం రాష్ట్ర వ్యాప్త ప్రముఖ బీసీ నాయకులు, బీసీ రాజ్యాధికార సమితి క్షేత్రస్థాయి భాద్యులతో నిర్వహించిన కాన్ఫరెన్సు కార్యక్రమంలో రాష్ట్రంలో దేశంలో బీసీల అంశంపై జరుగుతున్న రాజకీయ పరిణామాలను విశ్లేషించారు..78 ఏళ్ల స్వాతంత్ర అనంతరం కూడా బీసీలపై రాజకీయ,ఆర్థిక ,పారిశ్రామిక ,సామాజిక వివక్ష నేటికీ కొనసాగుతుండటం,దేశంలో అసమానతలు పెచ్చరిల్లుతుండటం తీవ్ర అవమానకరమని ఆక్షేపించారు. ఇటీవల కాంగ్రెస్ లోకసభ పక్ష నాయకులు రాహుల్ గాంధీ ఈ అంశాన్ని అంగీకరించడం, ఇకపై బీసీలకు జరిగిన నష్ట నివారణకు ప్రతిగా తాము అన్ని అవకాశాల్లో బీసీలకు అగ్రతాంబూలం అందిస్తామని ప్రకటించడం శుభపరిణామమన్నారు.. భారత కొలీజియం సైతం న్యాయస్థానాల్లోని పూర్తిస్థాయి నియామకాల్లో బీసీ రేజర్వేషన్లను అమలు చేయడానికి సిద్ధపడటం కూడా జరుగుతున్న పోరాటాలు,రాజకీయ పరిణామాల ఫలితమేనన్నారు.జరుగుతున్న పరిణామాలను బీసీలు క్షుణ్ణంగా గమనించాలని , తమ హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన సరైన సమయం ఇదేనని దాసు సురేశ్ స్పష్టం చేశారు..బీసీలు ఇప్పుడు తీవ్రంగా ఉద్యమిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లక్ష రాజకీయ పదవులను సులువుగా సాధించవచ్చునన్నారు..ప్రస్తుత పరిస్థితులను అదునుగా తీసుకొని బీసీలు రాజ్యాధికార ఉద్యమంలో ముందడుగు వేయాలని తెలిపారు.. బీజేపీ సైతం రాజ్యాంగ బద్ధమైన బీసీ బిల్లులను పార్లమెంటులో ఆమోదించి ఫెడరల్ స్ఫూర్తికి విలువనిచ్చి తెలంగాణ బిల్లు తరహాలో బీసీ బిల్లును ఆమోదింపజేసి చరిత్రలో నిలిచే అద్భుత అవకాశాన్ని సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు .



## రామ్ రెడ్డి చికెన్ సెంటర్ ప్రారంభం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి డివిజన్, గోపి నగర్ లో బీజేపీ నాయకులు సాయి నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రెడ్డి చికెన్ సెంటర్ షాప్ ను శేరిలింగంపల్లి మాజీ శాసన సభ్యులు భిక్షపతి యాదవ్, బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారబోయిన రవికుమార్ యాదవ్ లింగంపల్లి కంటేస్టేడ్ కార్పొరేటర్ ఎల్లేష్ , ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి వినియోగదారులు, మాంసాహార ప్రియులను అలరించాలని ఆకాంక్షించారు.

# నూతన ఎక్సైజ్ పాలసీ విధానాన్ని రద్దు చేయాలి

### చండూరు బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు పందుల సత్యం గౌడ్.



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం తేవాలనుకుంటున్న నూతన మద్యం పాలసీ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షులు పందుల సత్యం గౌడ్ ఆధ్వర్యంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బెల్లకొండ స్వాతి కి వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ గతంలో బి ఆర్ యస్ ప్రభుత్వం రాష్ట్రంలో 2620 మద్యం దుకాణాలకు గాను టెండర్ల లో పోటీ తత్వాన్ని పెంచి సుమారు లక్ష 25 వేల టెండర్లు వేయించి 2500 కోట్లు ఆదాయం వచ్చినట్లు ప్రకటించి, టెండర్ల ద్వారానే మధ్యతరగతి వారిని దోచుకుంది. నాటి ప్రభుత్వానికి రెట్టింపు మోసంతో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల త్రాగుడు మూడింతలు చేసే ప్రయత్నంలో ఉన్నదని, తెలంగాణ ఎక్సైజ్ లో సమూల మార్పులు అంటూ తెలంగాణ ప్రజల ఆరోగ్యం పనంగా పెట్టి ఎక్సైజ్ శాఖ ద్వారా ఆదాయ మార్గం ఎంచుకుని ఆ డబ్బులనే కొన్ని సంక్షేమ పథకాలకు ఉపయోగించే విధానాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. నేటి నూతన ఎక్సైజ్ పాలసీలో గ్రామానికి ఒక నూతన మద్యం దుకాణం, నగరానికి ఒక నూతన పబ్ మంజూరు చేస్తామంటూ, బీర్లను స్థానికంగానే తయారు చేయిస్తామని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలంగాణ లో విచ్చలవిడిగా మద్యంతో ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని, నూతన ఎక్సైజ్ విధానంలో గ్రామానికో మద్యం దుకాణాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బలవంతంగా గ్రామీణ వైన్సులు ఏర్పాటు చేసినట్లయితే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వాటిపై దాడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కోమటి వీరేశం, జిల్లా నాయకులు భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి, బోడ ఆంజనేయులు, సామ వెంకట్ రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సోమ శంకర్, ఉపాధ్యక్షులు పల్లెగోని చంద్రమౌళి, చెనగాని శేఖర్, కోశాధికారి మంచుకొండ సాగర్, కారింగు రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలి

### బి కే ఎస్ ఆధ్వర్యంలో వినతి..



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 31 యాసంగిలో పండించిన సన్న వడ్ల కు బోనస్ ఇప్పించాలని,అలాగే రైతులకు సరిపడే యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని, క్రాఫ్ట్ డ్యామేజ్ డబ్బులు వెంటనే నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు, అలాగే వ్యవసాయ అధికారి, జిల్లా వెటర్నరీ అధికారులకు వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు.. జగిత్యాల జిల్లాలో యాసంగి సీజన్ లో పండించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మిన సన్న వరిధాన్యం కు ఇంతవరకు బోనస్ డబ్బులు రాలేదనీ,రైతులకు బకాయి పడ్డ రావల్సిన బోనస్ డబ్బులు వెంటనే అందజేయాలని, జిల్లాలో యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులకు యూరియ అందుబాటు లేకుండా చేస్తున్నారనీ, నాలుగు బస్తాలు అవసరం ఉంటే ఒకటి మాత్రమే ఇస్తున్నారనీ, రైతులకు గతం లో మాదిరిగా అవసరం ఉన్నంత మేరకు సరఫరా చేయాలని, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులు, దానికి సహకరించే అధికార్ల పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, గత ఆరు నెలలుగా మండల పశువైద్య కేంద్రాలలో మందులు సరఫరా నిలిచిపోయిందని, మందుల కొరత లేకుండా చూడాలని కోరుతూ జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు జిల్లా ఇన్చార్జ్ చేపూరి విజయభాస్కర్, కసిడి లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప రాజేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నోముల నరసింహారెడ్డి, ముద్దం గంగారెడ్డి, మిట్టపల్లి తిరుపతి రెడ్డి, చల్ల సురేందర్, ఏనుగు తిరుమల్, బూస మల్లేశం, తిరుమల శంకర్, బి కే ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు దగ్ధం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

### ఎస్ఐ లక్ష్మయ్య




మిర్యాలగూడ జూలై 31:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం తడకమళ్ళ గ్రామంలో మిర్యాలగూడ ఆర్టీసీ డిపో బస్సు దగ్ధం చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ రూరల్ పోలీసు ఎస్ఐ ఎం.లక్ష్మయ్య గురువారం రాత్రి తెలిపారు. రాత్రి మూడు గంటల సమయంలో తడకమళ్ళ గ్రామం సెంటర్లోని ఎంపీపీ పాఠశాల ముందు పార్కు చేసి ఉన్న మిర్యాలగూడ డిపోకు చెందిన టిజి 05 జడ్ 0047 ఆర్టీసీ బస్సు ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టరు అనే విషయంలో ఆర్టీసీ బస్ కండక్టర్ సిహెచ్.బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, తడకమళ్ళ గ్రామస్తుడు కుసుమ సుదర్శన్ రెడ్డి తన గ్రామ శివారులోని పొల%శీ% పక్కనే ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ భూమి ఆక్రమించిన విషయమై గ్రామస్తులు అందరికీ తెలిసి దాని గురించే చర్చించుకుంటున్నారని, ఏవిదంగా అయిన దానిని దృష్టి మరలచాలని ఉద్దేశంతో గ్రామస్తుడు సహచరుడైన తంగేళ్ల జానకి రెడ్డితో కలిసి, పథకం ప్రకారం జూలై 23 అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇద్దరు కలిసి ఒక క్యాన్ లో కొంత డీజిల్ ను సుదర్శన్ రెడ్డి ఇంటి నుండి తీసుకొని ఒక కాగడాను తయారు చేసుకుని గ్రామ సెంటర్లో పార్కింగ్ చేసి ఉన్న ఆర్టీసీ బస్సు వద్దకు వెళ్లి బస్సు కుడి వైపున డ్రైవర్ సీటు వద్ద నుండి లోపలికి ప్రవేశించి లోపల డీజిల్ ని చల్లి కాగడాతో అంటించి తగలబెట్టి ఎవరికీ అనుమానం రాకుండా గ్రామం నుండి ఎటో వెళ్ళి గురువారం వారు ఇంటికి వస్తుండగా తడకమళ్ళ గ్రామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద పట్టుకుని ప్రశ్నించగా చేసిన నేరాన్ని అంగీకరించగా పంచుల సమక్షంలో ఒప్పుకోలు పంచనామా నిర్వహించి వారి నుండి వారు నేరం చేసిన రోజు ధరించిన బట్టలను, ఒక లైటర్ ను వారిద్దరి సెల్ ఫోన్లను స్వాధీన పరచుకున్నామన్నారు.కుసుమ సుదర్శన్ రెడ్డిపై మొత్తం 8 కేసులున్నాయన్నారు.తంగేళ్ల జానకి రెడ్డిపై మొత్తం 5కేసులు ఉన్నాయన్నారు. సెక్షన్ 379, 426ఐపిసి సెక్షన్ 379, 426ఐపిసి 303(2) బిఎన్ఎస్, సెక్షన్.3 ఆఫ్ పిడిపిపి యాక్ట్ 329(3), 351(2) బిఎన్ఎస్, సెక్షన్ కింద 61(2), 326 (జి) రీడ్ విత్ 3(5) బిఎన్ఎస్, సెక్షన్.3 ఆఫ్ పిడిపిపి యాక్ట్–1984 ఉన్నతాధికారుల సూచనల మేరకు పై ఇద్దరు నేరస్తులపైన రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ ఇతర ప్రాంతాల్లో ఎవరైనా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడము, భూములు ఆక్రమించుకోవడం, ప్రయత్నించడం లాంటి చర్యలకు పాల్పడినట్లైతే ఎంతటి వారినైనా వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇలాంటి వారితో బాధింపబడి ఉంటే నిర్భయంగా పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదుచేసుకోవాలనిఆయన కోరారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రతిష్ఠాత్మక ఏస్-2025 పురస్కారం

### గురుగ్రామ్‌లో అందుకున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం




సికింద్రాబాద్, వార్త జూలై 31... రాష్ట్ర ఉన్నత విద్యకు చుక్కానిగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయానికి మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. గురుగ్రామ్‌లో జరిగిన ఆల్ ఇండియా సర్క్యులర్ ఎకానమీ వేదికగా ఉన్నత విద్యా రంగంలో ప్రమాణాలకు గానూ ఏస్–2025 అవార్డును అందుకున్నారు ఉప కులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం. ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో సుస్థిరత, ఆవిష్కరణలు, నాయకత్వాన్ని ముందుకు తీసుకుని వెళ్తున్న కృషికి గుర్తింపుగా ఓయూకి ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ.... ఓయూ తరఫున ఈ పురస్కారం అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు. సర్క్యులర్ ఎకానమీని ముందుకు తీసుకుని వెళ్లేలా ఓయూలో జరుగుతున్న విద్య బోధనలు, పరిశోధనలు, లక్ష్యాలను సాకారం చేయగల ఆచరణాత్మ క కార్యాచరణకు ఈ అవార్డు ఒక నిదర్శనమన్నారు. పూర్తి స్థాయిలో గ్రీన్ క్యాంపస్‌గా రూపాంతరం చెందిన ఓయూ ప్రాంగణంలోని అన్నివిభాగాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకుని వెళ్తున్నామన్నారు. ప్రతి రోజు 2 టన్నుల వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్‌ను క్యాంపస్ లోనే నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలోని 17 వంటశాలల నుంచి వస్తున్న వ్యర్థాలను శుద్ధ ఇంధన వనరుగా ఉపయోగిస్తున్నామని, పచ్చదనం పెంపొందించేదుకు ఎరువు గా కూడా వాడుతున్నట్లు తెలిపారు. ఈ రోజు లభించిన ఏస్–2025 అవార్డుతో తమ ప్రయత్నా లకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చినట్లుగా భావిస్తామమన్నారు. ఈ సందర్భంగానే ఓయూ కన్జర్వేషన్ స్టడీస్ విభాగం ప్రొఫెసర్ సి. శ్రీనివాసులు నేతృత్వంలో తీసుకుంటున్న చర్యలను ప్రత్యేకంగా ప్రశంసించారు.

# జూలకంటి రంగారెడ్డికి వినతిపత్రం అందజేసిన ప్రైవేటు కళాశాల యాజమాన్యం



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 31చౌటుప్పల్ మండలం ,కోయ్యలగూడెం గ్రామంలో ప్రైవేటు జూనియర్,డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యులు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం వినతిపత్రం అందజేశారు. గత నాలుగు సంవత్సరాల నుండి స్కాలర్షిప్లు రాక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం కరెంటు బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్నామని, అధ్యాపకులకు జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, కాలేజీ బిల్డింగ్ లకు అద్దెలను చెల్లించడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి సిపిఎం పార్టీ తరఫున తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాలు బత్తుల శంకర్,గంగాపురం జంగయ్య,వల్ల రాజశేఖర్,సిలివేరు శ్రీనివాస్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్ తదితరులున్నారు



## తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు..సబితాఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... జూలై 31 ... దప్పుల దరువుకు అనుగుణంగా విన్యాసాలు.. శివసత్తులు పూనకాలు.. తొట్టెల, ఫలహారపు బండ్ల ఊరేగింపు, బోనాల ఉత్సవాలు సరూర్నగర్ డివిజన్లో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్పల్లి అశోక్ వారి కుమారుడు మానస్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగాయి. మహేశ్వరం నియోజకవర్గం పరిధి సరూర్నగర్ డివిజన్లో నిన్న రాత్రి సోమవారం తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు తొట్టెల ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పి. సబితాఇంద్రారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా మన బోనాలు నిలుస్తాయని ఆమె అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి బస్తీతో ఆషాఢం, శ్రావణం రెండు మాసాల పాటు ప్రతి ఇంట్లో బోనం అమ్మవారికి సమర్పించుకుని తల్లికి పూజలు నిర్వహించి పిల్లలు, కుటుంబం, రాష్ట్రం చల్లగా ఉండేలా, పాడి పంటలతో ఏ కష్టాలు లేకుండా జీవించే భాగ్యం కలగాలని ఆనాదిగా ప్రతి సంవత్సరం బోనాల పండుగను నిర్వహించుకుంటున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు భక్తులు, అభిమానులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గీత దయాకర్ కూతురి వివాహానికి హాజరైన పలువురు ప్రముఖులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 31... సికింద్రాబాద్ శాంతినగర్ కు చెందిన బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు గీతా దయాకర్ కూతురు మౌనికరావు వివాహ%శీ% నాగోల్ లోని పి.బి.ఆర్ కన్వెన్షన్ హాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు, చైర్మన్ల తోపాటు స్థానిక నాయకులు సుక్కగణేష్ ముదిరాజ్, నల్ల రాధాకృష్ణ, సిహెచ్ సునీల్ ముదిరాజ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## లాలాగూడ ఇన్స్పెక్టర్ రఘు బాబుకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారిలు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 31... రాఖీ పండుగ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సిస్టర్లు గురువారం లాలాగూడ ఇన్స్పెక్టర్ రఘుబాబు,డి ఐ రామకృష్ణ,ఎస్ఐలకు తోటి సిబ్బందికి రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు.



## తార్నాక లో నాలపై అక్రమ నిర్మాణాలను తొలగించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 31 ... తార్నాక స్ట్రీట్ నెంబర్ వన్ లో అక్రమంగా నాలాపై నిర్మానం చేపట్టిన వాటిని సికింద్రాబాద్ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది కలిసి తొలగించారు. జిహెచ్ఎంసి నాలాపై నిర్మాణాలు ఎలా చేపడుతారని సదరు అక్రమ నిర్మాణ దారుని హెచ్చరించి మరొకసారి ఇలాంటివి జరిగితే సహించేది లేదని వారికి తెలిపారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి జీవనరెడ్డి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 31 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ బొలిశెట్టి గంగారం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దిండిగాల రామస్వామి, సోమ వెంకటేష్, సుందరగిరి గంగాధర్, దుంపల నర్సిరెడ్డి, నీలి మహేందర్, షేక్ ఇస్మాయిల్, షేక్ మాలిక్, మాధ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కెవిఎస్ విద్యార్థిని బాక్సింగ్ నేషనల్ గేమ్స్ లోకాంస్య పతకం



మిర్యాలగూడ జూలై 31:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామ శివారులోని కేంద్రీయ విద్యాలయం ఏడో తరగతి విద్యార్థిని బి.యోగిత ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో జూలై 27న జరిగిన 54వ కెవిఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్ -2025 లో కాంస్య పతకం సాధించిందిబాక్సింగ్ అండర్ - 14, 34- 36 కెజిలో తలపడి కాంస్య పతకం సాధించడం పట్ల నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్, జిల్లా యువజన క్రీడాభివృద్ధి శాఖ అధికారి అక్బర్ ఆలీ యోగితను అభినందించారు. మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్పి క్యాంపు రాజీవ్ స్టేడియంలో కోచ్ రవీందర్ గౌడ్ అధ్వర్యంలో యోగితా శిక్షణ పొందింది. కోచ్ రవీందర్, యోగితా తల్లిదండ్రులను సబ్ కలెక్టర్ అమిత్, డివైఎస్డిఓ అక్బర్ ఆలీ అభినందించారు మిర్యాలగూడ జూలై 31:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామ శివారులోని కేంద్రీయ విద్యాలయం ఏడో తరగతి విద్యార్థిని బి.యోగిత ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో జూలై 27న జరిగిన 54వ కెవిఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్ -2025 లో కాంస్య పతకం సాధించినది.బాక్సింగ్ అండర్ - 14, 34- 36 కెజిలో తలపడి కాంస్య పతకం సాధించడం పట్ల నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్, జిల్లా యువజన క్రీడాభివృద్ధి శాఖ అధికారి అక్బర్ ఆలీ యోగితను అభినందించారు. మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్పి క్యాంపు రాజీవ్ స్టేడియంలో కోచ్ రవీందర్ గౌడ్ అధ్వర్యంలో యోగితా శిక్షణ పొందింది. కోచ్ రవీందర్, యోగితా తల్లిదండ్రులను సబ్ కలెక్టర్ అమిత్, డివైఎస్డిఓ అక్బర్ ఆలీ అభినందించారు



## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ సమావేశానికి హాజరైన...బీసీ నాయకులు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 31 : బీసీ పొలిటికల్ జేఏసీ చౌటుప్పల్ మున్సిపాలిటీ మండల కన్వీనర్ గట్టు మొగలయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం రోజున హైదరాబాద్ ఘట్కేసర్ జే కె ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుధా గాని హరి శంకర్ గౌడ్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యాధికార సాధనకు కార్యాచరణ ప్రణాళిక సమావేశానికి చౌటుప్పల్ నుండి హాజరై మద్దతు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోనీ వివిధ బీసీ సంఘాల నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, బీసీ సమాజ్ నాయకులు సూర్యారావు,బీసీ పొలిటికల్ జేఏసీ సమన్వయ కర్తలు నరసయ్య గౌడ్,నాగరాజు గౌడ్,చౌటుప్పల్ బీసీ నాయకులు గట్టు లింగస్వామి ముదిరాజ్, బొల్లమోని నర్సింహ ముదిరాజ్, శ్రీకాంత్, కృష్ణ ముదిరాజ్, సంపత్ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, చెరుకు శ్రీను గౌడ్, తదితరులు పాల్గొన్నారు .



## బాలికల ఆత్మ రక్షణ కోసం కుంగ్ ఫూ, కరాటే చాలా అవసరం. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ భార్గవ్.

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూలై 31

ఇటీవలి కాలంలో అమ్మాయిలపై జరుగుతున్న దాడుల దృష్ట్యా ఆత్మరక్షణ కోసం కుంగ్ ఫూ, కరాటే చాలా అవసరమని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ భార్గవ్ గారు అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటి పరిధిలోని గాంధీ పార్క్ వద్ద గల ప్రతిభ వొకేషనల్ జూనియర్ కళాశాల, శ్రీ మేధ జూనియర్ కళాశాలలో విధ్యార్థినులకు ఉచిత కుంగ్ ఫూ, కరాటే శిక్షణా కార్యక్రమాన్ని కుంగ్ ఫూ, కరాటే బ్లాక్ బెల్ట్ బొడ్డు పరమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి ఎస్ ఐ హాజరై ప్రారంభించి మాట్లాడుతూ విధ్యార్డులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్ , ఫేస్బుక్ లలో తమ వ్యక్తిగత సమాచారాన్ని ఉంచకూడదని తెలిపారు. విధ్యార్డులు విధ్యపై ఆసక్తి పెంచుకొని లక్ష్యసాధనకై కృషి ఛేయాలని సూచించారు.ఇలాంటి విద్యార్ధుల ఆత్మరక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి ,ప్రిన్సిపాల్ సిలివేరు శ్రీనివాస్, లింగస్వామి,రాజు,నిరంజన్, బాలక్రిష్ణ ,రాజేష్, జ్యోతి,రజిత, నవ్య ,జ్యోతి, భాగ్యలక్ష్మి ,రాణి , విధ్యార్దినీ విధ్యార్డులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## రాయికల్‌లో దొంగతనానికి పాల్పడిన దుండగులు తులం బంగారు నెక్లెస్, నాలుగు లక్షల నగదు అపహరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 31 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో బుధవారం రాత్రి చోరీ ఘటన కలకలం రేపింది. పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సమీపంలో నివాసం ఉండే మోర శంకర్ బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా మండలంలోని కిష్టంపేట గ్రామానికి ఓ శుభకార్యానికి వెళ్లారు. రాత్రి ఒంటి గంట సమయంలో తిరిగి ఇంటికి వచ్చిన శంకర్, తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి, తక్షణమే పోలీసులకు సమాచారం అందించారు. ఇంటిలో సుమారు తులంనర బంగారు నెక్లెస్, రూ.4 లక్షల నగదు దొంగలు అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు వెల్లడించారు. పట్టణంలోని ప్రజల్లో భయాందోళన సృష్టించిన ఈ చోరీపై అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ అందరికీ సంక్షేమ పథకాలు

### సర్వేల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

సంస్థాన్ నారాయణపురం, (వార్త మిర్రర్) జూలై 31:సంస్థాన్ నారాయణపురంమండల పరిధిలోనీ సర్వేల్ గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను సర్వేల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ షబ్బీర్,కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నాడు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని,రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ నిరంతర ప్రక్రియని పేద ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మానుపాటి సతీష్ కుమార్,గ్రామశాఖ కోశాధికారి వీరమల్ల పెంటయ్య,గ్రామశాఖ ఉపాధ్యక్షులు సుక్క స్వామి,గ్రామశాఖ కార్యదర్శి రాజేష్ యాదవ్,కార్యదర్శులు బోయ నరసింహ,పగిళ్ల శీను,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్త శేఖర్ రెడ్డి,ఎల్లంకి చంద్రయ్య,వెనుముల శంకర్ రెడ్డి,బాజా అంజయ్య, రమేష్,జమాల్, రఘు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకు మహేష్,గోపి, సాయి,పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పంచాయతీ కారోబార్ ఈశ్వర్,గ్రామ ప్రజలు,తదితరులు,పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకై డిల్లీలో తెలంగాణ భవన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన....బీసీఎస్ఎఫ్(బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ )



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 31... హలో బీసీబిచలో డిల్లీ కార్యక్రమంలో భాగంగా బీసీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిల్లీలోని తెలంగాణ భవన్ అంబెడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థి సంఘాల నాయకులు నిరసన చేపట్టారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన విద్య,ఉద్యోగ మరియు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ బిల్లుని ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ ద్వారా 42 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలని నిరసనలో వ్యక్తం చేశారు.చట్టసభల్లో 33 శాతం మహీళలకు కల్పిస్తున్న రిజర్వేషన్లలో బీసీ మహీళా కోటా ఏర్పాటు చేయాలన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో బీసీఎస్ఎఫ్ అధ్యక్షులు కొమ్మబోయిన సైదులు యాదవ్ బీసీ సంఘము కన్వీనర్ వీరబోయిన లింగం యాదవ్,టిఎస్పి అధ్యక్షులు బారి అశోక్ కుమార్,,విజెఎస్ ఓ యు అధ్యక్షులు కడారి రమేష్, సురేష్, గణేష్,వెంబడి అభి,శంకర్, సురేష్, గణేష్, పైడి, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ నిబంధన మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలి

### రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 31: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. మంగళ వారం జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని 1 వార్డులలో నిరుపేద కుటుంబానికి చెందిన మంద లావణ్య ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి ఆన్లైన్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులు వారు సూచించిన స్థలాన్ని చదును చేసి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉం డాలన్నారు. ప్రతి లబ్ధిదారులు 400 స్క్వేర్ ఫీట్స్ కు తగ్గకుండా 600 స్క్వేర్ ఫీట్స్ కు పెరగ కుండా ఇంటి నిర్మాణం చేపట్టాలని, పెరగకుండా ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.వెంకటి, హౌసింగ్ ఎ.ఇ పి. తిరుమల, మున్సిపల్ సిబ్బంది రజాక్, గంగారెడ్డి, శేఖర్ వార్డు కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ మొహమ్మద్ షాకీర్, సామల్ల లత, చింతకుంట సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యకల రమేష్, ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, బొమ్మ కంటి నవీన్, కడకుంట్ల నరేష్, బాపురపు నరసయ్య, మహమ్మద్ సాబీర్, పొన్నం శ్రీకాంత్ గౌడ్, బొద్దుల శివ కుమార్, కాటిపెల్లి రామ్ రెడ్డి, గుమ్మడి సంతోష్, గోపాల్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## దళిత సీనియర్ నాయకులు సేనాధిపతి కి దళిత సేవా రత్న అవార్డు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూలై 31... ఓయూ మానికేశ్వర్ నగర్ కు చెందిన దళిత సీనియర్ నాయకులు సరిగోమ్ముల సేనాధిపతి దళిత సేవా రత్న అవార్డును అందుకున్నారు. బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల -2025 వర్కింగ్ కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ సేనాధిపతికి దళిత సేవారత్న అందజేశారు.